క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు తెలిపారు. స్థానిక 42వ సచివాలయం పరిధిలో బాపూజీనగర్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అలాగే అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, గత ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి గల తేడాలను వివరించాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, నాయకులు నాగరాజు, రాగా నరసింహారావు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కంప్యూటర్ ఎంబ్రాయిడరీని పరిశీలిస్తున్న జింకా విజయలక్ష్మి, కోనేటి సునంద

ప్రొద్దుటూరు కల్చరల్ : మహిళలు కంప్యూటర్ ఎంబ్రాయిడరీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. స్థానిక బొల్లవరంలో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ సంస్థ ద్వారా మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ ఎంబ్రాయిడరీ శిక్షణను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ సంస్థ ప్రతినిధి మీతా ప్రసాద్, లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షురాలు సునంద, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవాలకు సన్నద్ధం



ముగ్గుల పోటీని పరిశీలిస్తున్న ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

కలసపాడు : కర్నూలులో ఈ నెల 12, 13వ తేదీల్లో జరగనున్న ఎస్టీయూ వజ్రోత్సవాలకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ పి.రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శేఖర్‌బాబు, ఎస్.వి.సత్యనారాయణ, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్, రవిక్రీస్తుదారి, మహిళా ఉపాధ్యక్షురాలు సలోమిసత్యవతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ప్రచార బైక్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలాయాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు పుల్లయ్య చేపడుతున్న ప్రచార రథం (బైక్)ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐఈఆర్టీ సంగీత సంక్రాంతి పండుగ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు శ్రీనివాసులు, మాధవ, నరసింహారెడ్డి, లక్ష్మీదేవి, మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట ఎంపీపీ పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, అరుణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన కోసం జగనన్నే మళ్లీ రావాలి

• మేధావుల సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మేధావుల సమావేశంలో పాల్గొన్న వివిధ వర్గాలకు చెందిన వారు

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో సుపరిపాలన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వివిధ వర్గాలకు చెందిన మేధావులు అభిప్రాయపడ్డారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా సోమవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ నేతృత్వంలో మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, ఇసాక్‌బాషా, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, కుడా చైర్మన్ గురుమోహన్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ బడిగింజల విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మిదేవి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమన్యాయం లభిస్తోంది. అంతేకాకుండా విద్యారంగంలో పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అందజేస్తున్న పథకాలు వారి జీవితాల్లో మార్పులు తీసుకువస్తాయి.

-ఎస్.మహబూబ్‌సాహెబ్, విశ్రాంత ఉపాధ్యాయుడు

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం



మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. బడ్జెట్‌లో 16 శాతం నిధులు వైద్యరంగానికి కేటాయించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయి. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం చారిత్రాత్మక నిర్ణయం.

- డాక్టర్ కోటసుమన్, బద్వేలు

బీసీలను ఉన్నతస్థాయికి తెచ్చారు



బీసీ అంటే బ్యాక్‌వర్డ్‌క్లాస్ కాదని, బ్యాక్‌బోన్‌క్లాస్ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు తగినట్లుగానే బీసీలను ఉన్నత స్థాయికి చేర్చారు. బీసీలకు 4 రాజ్యసభ స్థానాలు, 5 ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించి వెనుకబడిన వర్గాల ఉన్నతికి గట్టిగా కృషి చేస్తున్నారు. బీసీలకు అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే.

- బి.గురుమూర్తి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు

దేశంలోనే అగ్రగామిగా ఏపీ



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం బలోపేతానికి తీసుకుంటున్న చర్యలతో గ్రాస్‌ఎన్‌రోల్‌మెంట్ రేటు 34 శాతం పెరిగి దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలిచింది. ఎన్నో ఏళ్లుగా దేశంలో విద్యావ్యవస్థలో అగ్రగామిగా ఉన్న కేరళ రాష్ట్రాన్ని మించి ఏపీ మొదటిస్థానంలో నిలవడం గొప్ప విషయం. అంతేకాకుండా ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

-కె.రమేష్‌యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి

వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి



అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి వికేంద్రీకరణ చేయాలనుకోవడం శుభపరిణామం. ఇందులో భాగంగానే కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించడం గొప్ప విషయం. బద్వేలులో సీనియర్ సివిల్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేసింది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ప్రభుత్వం పునరాలోచించాలి.

- డి.బ్రహ్మారెడ్డి, న్యాయవాది

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. అమ్మఒడి, నాడు-నేడు వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. దాదాపు రూ.57 వేల కోట్లు విద్యారంగానికి ఖర్చు పెట్టడం గొప్ప విషయం. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు సీఎం చర్యలు సత్ఫలిస్తున్నాయి.

- సి.రామచంద్రారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఆర్టీసీ విలీనం చరిత్రాత్మకం



పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ఆర్టీసీలో పని చేస్తున్న 52 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. ఆర్టీసీ కార్మికులంతా ఆయనకు రుణపడి ఉంటారు.

-ఎ.సుందరయ్య, ఆర్టీసీ ఉద్యోగి

వ్యాపారాలు మెరుగుపడ్డాయి



రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపారాలు మెరుగుపడ్డాయి. ముఖ్యమంత్రి వివిధ పథకాల రూపంలో ప్రజలకు పెద్ద ఎత్తున నగదు అందజేస్తుండటంతో వ్యాపారాలు కూడా పుంజుకున్నాయి. తద్వారా పన్నుల రూపంలో ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. వీటి ద్వారా ప్రజలకు భారీగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

- కె.వి.సుబ్బారావు, వర్తక సంఘం అధ్యక్షుడు



సామాజిక సాధికార బస్సు యాత్రలో జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ఓ అభిమానం ఉత్సాహం



సామాజిక సాధికార సదస్సులో భారీగా పాల్గొన్న జనం

పీఏసీఎస్ కమ్యూనిటీ హాలు ప్రారంభం



కమ్యూనిటీ హాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఆప్కాబ్ ఝాన్సీరాణి

బి.కోడూరు : బి.కోడూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.30 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ కమ్యూనిటీ హాలును ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది, ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్సీ మాట్లాడారు. ఎంతో వెనుకబడిన బి.కోడూరు మండలానికి సొసైటీ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి చొరవతో చైర్‌పర్సన్ ఝాన్సీరాణి కృషి వల్ల నూతన భవనం మంజూరైందని తెలిపారు. దీనివల్ల ఖాతాదారులు, ప్రజలకు సేవలు మరింత మెరుగు అవుతాయని పేర్కొన్నారు. అనంతరం ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ వివిధ రకాల పొదుపు సంఘాల సభ్యులకు పరిమితిని పెంచి దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేసి ప్రజల అభివృద్ధికి సొసైటీ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. బంగారు రుణాలు ఇచ్చేందుకు కూడా కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల రాజారాంరెడ్డి, నాబార్డు డీడీఎం విజయవిహారి, ఆప్కాబ్ డీపీడీఎం వీరశేఖర్‌బాబు, డీసీసీ బ్యాంకు వైస్‌చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, బి.కోడూరు, బి.మఠం సింగిల్‌విండో అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ వై.ప్రతాప్ రెడ్డి, మేనేజర్ జె.కళావతి, సీఈఓ గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిని ప్రత్యేక శ్రద్ధతో నేర్చుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ నటి, నర్తకీమణి మంజు భార్గవి

ప్రొద్దుటూరు : కూచిపూడి నృత్యాన్ని ప్రత్యేక శ్రద్ధతో నేర్చుకోవాలని ప్రముఖ సీనియర్ నటి, నర్తకీమణి మంజు భార్గవి తెలిపారు. సోమవారం స్థానిక వైఎంఆర్ కాలనీలో నృత్యతరంగిణి కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువులు ఇచ్చే మెలకువలు నేర్చుకుంటూ కూచిపూడి నృత్యంలో ఉన్నత స్థానాల్లో రాణించాలన్నారు. నాట్య నిలయంలోనే కాకుండా ఇంటి వద్ద కూడా విద్యార్థులు సాధన చేస్తే ఉత్తమ ఫలితం దక్కుతుందన్నారు. విద్యార్థులను నాట్య నిలయంలో చేర్చిన ఏడాదిలోనే వేదికలపై నృత్య చేయించాలని తల్లిదండ్రులు ఆరాట పడుతున్నారని, దీనివల్ల అనుకున్నంతగా రాణించలేక పోతున్నారన్నారు. పూర్తి స్థాయిలో నాట్యం నేర్చుకుని వేదికలపై ప్రదర్శనలు ఇవ్వాలని సూచించారు. కృష్ణా జిల్లా కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్ రామలింగశాస్త్రి, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత వసంత కిరణ్ మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగిన కూచిపూడి నృత్య శిక్షణకు హాజరైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. మంజుభార్గవి రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరిదేవి ఆలయాలను సందర్శించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నృత్యతరంగిణి కళానిలయం నిర్వాహకుడు శ్రావణ్ కుమార్, నాట్య గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా ఆరోగ్యశ్రీ



ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేద ప్రజల ఆరోగ్యానికి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ భరోసా, భద్రత ఇస్తుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సోమవారం దొరసానిపల్లె గ్రామ పంచాయతీలో నూతనంగా మంజూరైన రూ.25లక్షల ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్డు విలువ మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం నిబంధనలను సడలించి ఎక్కువ మందికి లబ్ధి కలిగేలా చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి 3,555 జబ్బులను చేర్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, సర్పంచ్ అరవ మునివర ఈశ్వరమ్మ, వైస్ సర్పంచ్ మార్తల లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ హనీఫ్ బాబా, ఎంపీటీసీ పందిటి మేరి తదితరులు పాల్గొన్నారు.

మూలవారిపల్లె సమస్యలు పరిష్కరిస్తా

ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలవారిపల్లె గ్రామ సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మూలవారిపల్లె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డ్రైనేజీ కాలువల సమస్య, సిమెంటు రోడ్లు, శ్మశాన వాటిక స్థలం, రామాలయానికి గ్రిల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు స్పందించిన ఆయన అక్కడికక్కడే ఏఈ నాగభరత్ రెడ్డికి ఫోన్ చేశారు. కాలువ నిర్మాణానికి అంచనాలను తయారు చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామన్నారు. రామాలయానికి తన సొంత నిధులతో గ్రిల్ నిర్మిస్తానని తెలిపారు. ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచిరెడ్డి కొండారెడ్డి, ఉప సర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీటీసీ నందిమండలం వీరారెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, లింగాపురం సొసైటీ అధ్యక్షుడు తుపాకుల ప్రతాప్‌రెడ్డి, జేష్టాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ యువజన ఉత్సవాలు



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మైదుకూరు : జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ అహల్యాబాయి మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దశదిశలా చాటారని తెలిపారు. వివేకానంద జయంతి జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా సాంస్కృతిక కన్వీనర్ ఖాజా హుస్సేన్, గంజికుంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఈశ్వరమ్మ, దీప్తి, అమ్మ సేవా సమితి అధ్యక్షుడు వాగ్దాడం శివశంకర్ పాల్గొన్నారు.

కోలాహలంగా బస్సుయాత్ర

బద్వేలు అర్బన్/గోపవరం : బద్వేలు పట్టణంలో సోమవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర అశేష జనవాహిని మధ్య కోలాహలంగా సాగింది. స్థానిక సిద్దవటం రోడ్డులోని సీఎస్ఐ చర్చి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు జరిగిన ర్యాలీలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, ఇసాక్‌బాష, నెల్లూరు నగర మేయర్ స్రవంతి తదితరులు బస్సులో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. దారి పొడవునా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఉల్లాసంగా ర్యాలీలో పాల్గొని జై జగన్, జై జైజగన్ నినాదాలతో హోరెత్తించారు. పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీలకు మైనార్టీ కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం 1.50 ఎకరాల భూమిని కేటాయిస్తూ తీర్మానం చేయడంతో కృతజ్ఞతగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లా బకాస్ నేతృత్వంలో పెద్ద ఎత్తున ముస్లింలు, ముస్లిం మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. డీజేలు, బ్యాండు మేళాలు, బాణాసంచా పేలుళ్లతో పట్టణంలో పండుగ వాతావరణం కనిపించింది. కార్యక్రమంలో బద్వేలు మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయవంతం

బద్వేలు అర్బన్ : సమష్టి కృషితో బద్వేలులో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం అయిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇలా అన్ని వర్గాల వారి కృషితో కార్యక్రమం విజయవంతమైందని అన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు ఆకర్షితులై స్వచ్ఛందంగా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో మరింత గట్టిగా పని చేసి బద్వేలులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పోరుమామిళ్ల : బద్వేలులో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర ర్యాలీలో పాల్గొనేందుకు పోరుమామిళ్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా బయలుదేరారు. పట్టణంలో ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, కోఆప్షన్ మెంబర్ అల్లా ఆధ్వర్యంలో పంచాయతీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరం

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో సచివాలయ పరిధిలోని ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకుని మందులు పొందవచ్చన్నారు.

స్పందనలో ఫిర్యాదు

చాపాడు : మండల పశు వైద్యాధికారి మహమ్మద్ గౌస్ పశువులకు వైద్యం చేసేందుకు పాడి రైతులకు అందుబాటులో ఉండటం లేదని సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు టీఓపల్లెకు చెందిన లింగిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా తమ పశువులకు మందులు అవసరం కాగా అన్నవరంలోని పశు వైద్యశాలకు వెళ్లగా సిబ్బంది ఉండటం లేదన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని మండల పశు వైద్యశాలకు వెళ్లగా అక్కడా మండల పశు వైద్యాధికారి అందుబాటులో లేరన్నారు. ఫోను ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందించలేదన్నారు. దీంతో ప్రభుత్వ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలియజేశాడు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల : రామేశ్వరంలోని ఎస్టీ కాలనీకి చెందిన గుర్రయ్యను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అతను స్థానిక ఆర్టీసీ బస్టాండులో అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉండటంతో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

రక్తదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన కోటక్ మహీంద్ర బ్యాంకు ఉద్యోగి ధారా సంతోష్ కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా 30వ సారి సోమవారం రక్తదానం చేశారు. 30 ఏళ్లుగా నేత్రదానం, రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నానని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని కొండూరు పోలీసుస్టేషన్ సమీపాన కడప – బద్వేలు ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోవిళ్ళ నారాయణరెడ్డికి గాయాలు అయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కొత్తకోటపాడు గ్రామానికి చెందిన చెందిన నారాయణరెడ్డి వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు వైపు దూరంగా నిలిచి ఉన్నాడు. సిద్దవటం వైపు నుంచి బద్వేలు వైపు ఓ గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వచ్చి ఆయనను ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు 108 వాహనంలో కడపకు తరలించారు. ద్విచక్ర వాహనదారుడు అక్కడ నుంచి చాకచక్యంగా ఉడాయించాడు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ..

అట్లూరు మండల పరిధిలోని ముత్తుకూరుకు చెందిన మద్దూరురామయ్య ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో గాయపడ్డాడు. రామయ్య తన అత్తగారి గ్రామమైన చెన్నూరు మండలం రామనపల్లెకు వెళుతుండగా లంకమల అభయారణ్యం షరాబుదిన్నె సమీపాన ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో రామయ్య తలకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో కడపకు తరలించినట్లు బంధువులు తెలిపారు.